క్లుప్తంగా

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సత్యమ్మ అమ్మవారు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంలో బుధవారం గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యమ్మ, మారెమ్మ, గంగమ్మ ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టి 41 రోజులు పూర్తయిన సందర్భంగా మూడు ఆలయాల్లో వేదపండితులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు, ప్రజలు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మంచినీటి పథకానికి మరమ్మతులు


బోరు మోటార్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని మంచినీటి పథకానికి బుధవారం సర్పంచ్ శివరాముడు మరమ్మతులు చేయించారు. బ్రిడ్జి వద్ద ఉన్న రెండు బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గ్రామంలో తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడటంతో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. ఇటీవల 7సెంటీ మీటర్ల వర్షం కురిసింది. ఈ మేరకు బోర్లకు సంబంధించి మోటార్లను బయటకు తీసి మరమ్మతు పనులు చేయిస్తున్నామని తెలిపారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి యథావిధిగా ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తామని సర్పంచ్ చెప్పారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

కోవెలకుంట్ల: మూడేళ్లు నిండి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఎంఎల్‌హెచ్‌ఓ మమత, అంగన్‌వాడీ కార్యకర్త పుల్లమ్మ కోరారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కలుగొట్ల గ్రామంలో చిన్నారులు, తల్లులతో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు మధ్యాహ్నభోజనం ఉంటుందన్నారు. ప్రతి రోజు గుడ్డు, పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుజాత, ఆశావర్కర్లు విజయకుమారి, నాగేశ్వరి పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ


అబ్దుల్ కలీం

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎం అబ్దుల్‌కలీం (2020-22 బ్యాచ్) నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటాడు. 653/720 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజికా సత్యప్రపూర్ణ బుధవారం తెలిపారు. బనగానపల్లె పట్టణానికి చెందిన ఈ విద్యార్థి తండ్రి అబ్దుల్ సలాం గోల్డ్‌స్మిత్, తల్లి సాయిదామున్నీసా ఎర్రగుడి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. గతేడాది డెంటల్ సీట్ వచ్చినప్పటికీ ఎంబీబీఎస్ సీట్ కోసం షార్ట్ టర్మ్ కోచింగ్ తీసుకుని సాధించాడు. ఎంబీబీఎస్ తరువాత కార్డియాలజీ విభాగంలో పీజీ చేయడమే ధ్యేయమని ద్యార్థి అబ్దుల్‌కలీం తెలిపారు.

ఘర్షణ కేసు నమోదు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామంలో ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. ఆదిశేషుతో పాటు మరో ఇద్దరు, భాస్కర్‌తో మరోఎనిమిది మంది పాతకక్ష్యలను మనసులో పెట్టుకొని ఒకరిపై ఒకరు ఘర్షణ పడినట్లు ఎస్ఐ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోవెలకుంట్లలో భారీ వర్షం

కోవెలకుంట్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం పడింది. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లోనూ వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా వర్షాలు అనుకూలంగా మారటంతో ఈ ఏడాది ఖరీఫ్ అన్ని విధాలా కలిసొస్తుందని రైతులు భావిస్తున్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు ఆకుమల్ల, వసంతాపురం, ముక్కమల్ల, ఆల్వకొండ తదితర గ్రామలలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు 3 గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన పడింది. వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే భారీ వర్షం కురువడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేరేడు పండు.. పోషకాలు మెండు

- సీజన్‌లో మాత్రమే లభ్యం
- ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- మార్కెట్లో కిలో ధర రూ.150 నుంచి రూ.200


మార్కెట్లో విక్రయానికి ఉంచిన నేరడు పండ్లు

సంజామల: నోరూరించే నేరేడు పండ్లు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఈ పండ్లు జూన్, జూలై నెలల్లో మాత్రమే లభిస్తాయి. ఆరోగ్య ప్రదాయినిగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండటమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి మేలు చేస్తాయి. ఈ పండ్లను ఉభయ గోదావరి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, మదనపల్లి, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకొని విక్రయాలు సాగిస్తున్నారు. పట్టణంలో వ్యాపారులు తోపుడు బండ్ల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోకి సైతం వ్యాపారులు వచ్చి పండ్లను విక్రయిస్తున్నారు. అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్క్రీమ్ తయారు చేసుకోవచ్చు.

నాణ్యతను బట్టి రేటు

నేరేడుపండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్నది కావడంతో ధర కూడా అధికంగానే ఉంటుంది. వినియోగ దారుల చేతికొచ్చేసరికి కిలో రూ.150 నుండి ధర రూ.200 పలుకుతుంది. అందులో నాణ్యమైన నేరేడుపండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధాన పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుత సీజన్లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే అనేక రోగకారక సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

నేరేడు పండ్లతో ప్రయోజనాలు..

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి నేరేడు పండు దోహదపడుతుంది.
- నేరేడుపండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు మేలు చేస్తుంది.

అతిగా తింటే దుష్ఫలితాలు..

- నేరేడుపండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవించవచ్చు.
- వగరు రుచి కలిగిన నాణ్యత లేని నేరేడుపండ్లు భుజిస్తే గొంతు నొప్పి రావచ్చు. సీజన్ మారే సమయంతో ఈ పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్నవారు ఈ పండ్లను ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడుపండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాలతో బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి వచ్చే అవకాశం ఉంది.

అంతా అయోమయం!

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ విశ్లేషకుల నుంచి సాధారణ పౌరుడు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాడు. ప్రజాదరణ ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కాదని...ఏకపక్షంగా విజయం ఎలా సాధ్యమైందని అనుమానం వ్యక్తం చేస్తూ ప్రశ్నిస్తున్నారు సామాన్యులు.

ఆశ్చర్యంగా ఉంది



మా గ్రామంలో వైఎస్సార్‌సీపీ మంచి పట్టు ఉంది. వాస్తవానికి వైఎస్సార్‌సీపీకే మెజార్టీ రావాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా టీడీపీ అభ్యర్థికి మెజార్టీ రావడం ఆశ్చర్యంగా ఉంది. మేమంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశాం. ఏమి అయిందో... ఏమో తేలియదు. అంతా అయోమయంగా ఉంది. మా గ్రామంలో అందరు షాక్ అవుతున్నారు.

– వెంకటేశ్వర్ రెడ్డి,గిద్దలూరు గ్రామం, సంజామల మండలం.

ఏమి అర్థం కావడం లేదు....



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ అంగీకరిస్తున్నారు కూడా. అయినా ఓడిపోయాడంటే ఏమి అర్థం కావడం లేదు. పోలింగ్ రోజు ప్రతిఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామని చెప్పారు. అసలు ఏమి జరిగిందనే విషయం అర్థం కావడం లేదు.

– ఓబులేష్, లక్షుంపల్లి గ్రామం

మా ఊరిలో ఎప్పడూ టీడీపీకి మెజార్టీ రాలేదు



మా ఊరిలో ఎప్పుడూ టీడీపీకి మెజార్టీ రాలేదు. వైఎస్సార్‌సీపీకి వీర అభిమానులు ఉన్నారు. గత ఐదేళ్లలో మా గ్రామం చాలా అభివృద్ధి చెందింది కూడా. ఈ సారి ఎక్కువ మెజార్టీ వస్తుందని అనుకున్నాం. ఇందుకు విరుద్ధంగా టీడీపీకి మెజార్టీ రావడం ఆశ్చర్యానికి గురి చేసింది. అసలు ఏమి జరుగుతోందో అర్థం కావడం లేదు. నా దృష్టిలో విచిత్రమైన ఫలితాలు. ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది.

–అరవ రామభూపాల్, శింగనపల్లె గ్రామం, అవుకు మండలం

ల్యాబ్‌టెక్నీషియన్ల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న రామేశ్వరరావ్

డోన్ : వ్యాధి నిర్ధారణలో ల్యాబ్‌టె క్నీషియన్ల పాత్ర కీలకమని మలేరియా జిల్లా ముఖ్య అధికారి రామేశ్వరరావ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ల రెండురోజుల శిక్షణ ముగింపు సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మైక్రోస్కోప్ ద్వారా మలేరియా పరాన్నజీవి ఏవిధంగా ఉందో పరీక్షించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడమే ఈ రెండురోజుల శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. డోన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 12 మంది ల్యాబ్ టెక్నిషియన్లకు నాలుగు విడతలుగా శిక్షణ ఇచ్చినట్లు విస్తరణ అధికారి రామవిజయారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు సుబ్బలక్ష్మయ్య, డాక్టర్ సాబాస్‌హసన్, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెసర సాగుకు అనుకూలం



కోవెలకుంట్ల: నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌లో పెసర సాగుకు అన్ని విధాలా అనుకూలమని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. ఖరీఫ్‌లో పెసరను తొలకరి పంటగా వచ్చే నెల 15వ తేదీ వరకు సాగు చేయవచ్చన్నారు. సరైన విత్తన రకాలను ఎంచుకుని సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడలు ఆశించకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. పెసర సాగు పద్ధతులను ఆయన వివరించారు.

నేలలు: పెసర పంటను అన్ని రకాల భూముల్లో సాగు చేయవచ్చు. కాని చౌడు నేలలు, మురుగునీరు నిలిచి ఉండే నేలలు పనికి రావు.

నేల తయారీ: ఒకసారి నాగలితో, రెండుసార్లు గొర్రుతో మెత్తగా దున్ని, గుంటకతోలి నేలను విత్తనానికి అనువుగా తయారు చేసుకోవాలి. లోతు దుక్కి చేసినట్లు అయితే పైరు త్వరగా బెట్టకు రాదు.

విత్తనం: ఎకరాకు 5–6 కిలోల చొప్పున మొక్కల సాంద్రత సమానంగా ఉంటేటట్లు విత్తుకోవాలి. సాళ్లలో గొర్రుతో వెదబెట్టాలి. చెక్కగొర్రుతోకాని, ట్రాక్టరుకు అమర్చిన ఇనుప గొర్రుతోకాని వరుసకి 30 సెంమీ, మొక్కకి 10 సెంమీ దూరం ఉండేటట్లు విత్తుకోవాలి. ట్రాక్టరు గొర్రుతో విత్తినప్పుడు హెక్టారుకు సిఫారసు చేసిన దానికంటే 1– 2కిలోల విత్తనం ఎక్కువగా విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు, తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బోసల్ఫాన్, 2.5 గ్రాముల థైరమ్ లేక కాప్టాన్ మందులతో విత్తను శుద్ధి చేయాలి. మొదటిసారి పండించే భూముల్లో పెసరకు రైజోబియం 200 గ్రాములు, పీఎస్‌బా 200 గ్రాములు కలిపి విత్తితే అధిక దిగుబడులు పొందవచ్చు. దీని వల్ల సిఫారసు చేసిన నత్రజని, భాస్వరం, ఎరువు ఆదా అవుతుంది. విత్తడానికి ముందు పురుగు మందు తర్వాత తెగులు మందు, చివరగా పైరు విత్తుకు నేటప్పుడు సూక్ష్మజీవుల కల్చరును పట్టించాలి.

ఎరువులు: ఎకరాకు 2–3 టన్నుల పశువుల ఎరువు దుక్కిలో వేసి కలియదున్నాలి. ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం విత్తనం వేసే ముందు వేసుకోవాలి. వరిమాగాణుల్లో ఎరువులు వాడాల్సిన అవసరం లేదు.

సహ పంటలు: పెసరలో సహ పంటగా కంది, పత్తి, మొక్కజొన్న, ఆముదం, తదితర పంటలు వేసుకోవచ్చు. కంది, పెసర 1:7 నిష్పత్తిలో, ప్రతి, పెసర 1:3 నిష్పత్తిలో మొక్కజొన్న, పెసర 1:3, జొన్న, పెసర పంటలు 1:3, ఆముదం, పెసర పంటలు 1:7 నిష్పత్తిలో వేసుకోవాలి.

నీటి యాజమాన్యం: పెసర వర్షాధారపు పంట. కాని వర్షాభావ పరిస్థితులు ఏర్పాడినప్పుడు నీటి వసతి ఉన్న చోట మొదటి తడి మొగ్గ దశలో, రెండవ తడి పిందె ఏర్పడిన దశలో ఇస్తే మంచి దిగుబడులు పొందవచ్చు. వరి మాగాణుల్లో నీటి తడి అవసరం లేదు. నల్లరేగటి నేలలకు తేలిక పాటి తడులు ఇవ్వాలి. పైరు పూత దశలో నీటి తడి ఇవ్వకూడదు. పైరు బెట్టకు వచ్చి నీటి తడి లేనప్పుడు వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు 1.5 శాతం యూరియా పైరుపై పిచికారీ చేయాలి.

సస్యరక్షణ పద్ధతులు...

పొగాకు లద్దె పురుగు: ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని గీరి తినడం వల్ల ఆకులు తెల్లగా కన్పిస్తాయి. ఇది ఆకులకు రంధ్రాలు వేసి ఆకులను పూర్తిగాను, పూత, పిందెలను కూడా తిని నష్టపరుస్తాయి. ఈ పురుగులు రాత్రిపూట ఎక్కువగా తింటూ పగలు మొక్కల మొదళ్లలో, భూమి నెర్రెలలో దాగి ఉంటాయి. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చేపట్టాలి. గుడ్ల సముదాయాన్ని ఏరివేయాలి. జల్లెడగా మారి పిల్లపురుగులు ఉన్న ఆకులను ఏరివేసి నాశనం చేయాలి. ఎకరాకు 4 లింగాక్షణ బుట్టలు ఏర్పాటు చేయాలి. ఎకరాకు 250 ఎంఎల్ ఎస్‌పీవీ ద్రావణాన్ని సాయంకాలం సమయంలో పిచికారీ చేయాలి.

చిత్తపురుగు: మొక్కను రెండాకుల దశలో ఆశించి ఆకులలో చిన్న చిన్న రంధ్రాలను చేసి మొక్కలకు నష్టం కలుగజేస్తాయి. నివారణకు లీటరు నీటికి 2.5 ఎంఎల్ క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ: ఆకులలోని రసాన్ని పీల్చి పంటకు నష్టం కలుగజేస్తాయి. వీటి వల్ల ఎల్లోమొజాయిక్ అనే వైరస్ వ్యాధి వస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 1.6 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 2 ఎంఎల్ మెటాసిస్టాక్స్ అనే మందును కలిపి పిచికారీ చేయాలి.

మారుకా మచ్చల పురుగు: ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశలో ఆశించి పైరుకు ఎక్కువగా నష్టం కలుగజేస్తుంది. ఈ పురుగు పూత, పిందెల దగ్గర చేరి గూడులో ఉంటూ కాయలోని గింజలను తింటుంది. నివారణకు లీటరు నీటికి 1 గ్రాము ఎసిఫేట్ లేదా 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ లేదా 2.5 ఎంఎల్ క్లోరోఫైరిఫాస్ లేదా 1 ఎంఎల్ డైక్లోరోవాస్ కలిపి పురుగు ఉధృతిని బట్టి 4–5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. తైవాన్ స్ప్రేయర్‌ను ఉపయోగిస్తే ఎట్టి పరిస్థితుల్లో స్ప్రే ద్రావణం ఎకరాకు 60–70 లీటర్లకు మించరాదు.

కొరినోస్పోరా ఆకుమచ్చ తెగులు:

మెట్టపైరులో విత్తిన 30–35 రోజుల తర్వాత వర్షం పడినప్పుడు తెగులు ఉధృతి ఎక్కువ. ఈ తెగులు ఆకులపై చిన్న చిన్న గుండ్రని గోధుమరంగు మచ్చలు ఏర్పడి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో పెద్ద మచ్చలు వలయాకారంగా ఏర్పడి ఆకులు ఎండి రాలిపోతాయి. తెగులు కనపడిన వెంటనే లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ అనే మందును పిచికారీ చేయాలి. అవసరమైతే లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్‌ను పిందె, కాయ దశల్లో పిచికారీ చేయాలి.

బూడిద తెగులు:

ఈ తెగులు విత్తిన 30–35 రోజుల తర్వాత గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ముదురు ఆకులపై బూడిద రూపంలో చిన్న చిన్న మచ్చలు ఏర్పడి అవి క్రమేపి పెద్దవై ఆకులపైన, కింద భాగాలకు, కొమమలకు, కాయలకు వ్యాపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 1 గ్రాము థయాఫానేట్ మిథైల్ లేదా 1 ఎంఎల్ కేరాథేన్ లేదా 2 ఎంఎల్ హెక్సాకొనజోల్ లేదా 1 ఎంఎల్ ట్రైడిమార్ఫ్‌లను కలిపి 10–15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

పల్లాకు తెగులు:

ఇది వైరస్ జాతి తెగులు. ఈ తెగులు పంటను పూర్తిగా నష్టపరుస్తుంది. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన మొక్కల ఆకులు, కాయలమీద పసుపుపచ్చ పొడలు ఏర్పడతాయి. తెగులు సోకిన మొక్కలను వెంటనే పీకి కాల్చివేయాలి. తెల్లదోమ ఉధృతిని అరికట్టుటకు లీటరు నీటికి 1.25 ఎంఎల్ ట్రైజోఫాస్ కలిపి పిచికారీ చేయాలి. 1 కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బోసల్ఫాన్‌తో విత్తన శుద్ధి చేయాలి.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


మొక్కను నాటుతున్న జడ్జి తంగమణి



మొక్కను నాటుతున్న ఫారెస్టు అధికారులు

డోన్ టౌన్ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని బుధవారం స్థానిక సబ్ కోర్టు ఆవరణలో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సాకే జ్యోతి, న్యాయవాదులు, సిబ్బందితో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో రోజు రోజుకు పెరిగిపోతు కాలుష్యంతో వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయన్నారు. భావి తరాలకు మంచి వాతావరణ సమాజాన్ని, భవిష్యత్‌ను అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన గురుతర బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో డోన్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, కార్యదర్శి లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్, కోశాధికారి వంగమూరి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి నాగరాజు, సీనియర్ న్యాయవాదులు రామలింగయ్య, సదానంద బాబు,ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌ఓ సుబ్బయ్య అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామ సమీపాన వెలసిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఆవరణలో సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు జయమ్మ, సెహాన్ షావలీ, సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న రెడ్డి నాగరాజు

కొలిమిగుండ్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని బుధవారం కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో వివిధ రకాల 500 మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రవికుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

8 నుంచి బస్ పాస్‌ల జారీ

బనగానపల్లె : పాఠశాలలు 12వ తేదీన పునఃప్రారంభమవుతుండడంతో 8వ తేదీ నుంచి కొత్త బస్ పాస్‌లు జారీ చేస్తామని బనగానపల్లె ఆర్టీసీ డీఎం రవికిశోర్ తెలిపారు. కొత్త సాఫ్ట్‌వేర్ మార్పు కారణంగా 6,7వ తేదీల్లో బస్‌పాస్ కౌంటర్లు పని చేయవన్నారు. 8వ తేదీ నుంచి కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని తెలిపారు.

వాహనాల తనిఖీ


బస్ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: పట్టణం సమీపాన 44వ జాతీయ రహదారిపై బుధవారం ఆర్‌టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరుకు చెందిన ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి వెళ్తుండగా తనిఖీ చేశారు. రోడ్ ట్యాక్స్ చెల్లించలేదని గుర్తించిన ఆర్‌టీఓ రూ.58,500 జరిమానా విధించారు.

మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దస్తగిరి

బనగానపల్లె రూరల్ : నూతనంగా ఏర్పడే కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి మెగా డీఎస్సీ ప్రకటిస్తూ మొదటి సంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కో ఆడిట్ కన్వీనర్ దస్తగిరి, జిల్లా సహా అధ్యక్షుడు సత్యప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ నూతనంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. జీవో నంబరు 117ను రద్దు చేస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని, విద్య హక్కు చట్టప్రకారం ప్రతి పాఠశాలలోను ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు సుధాకర్, కృష్ణయ్య, సతీష్, నాగరాజు, మనోహర్, సన్నన్న, గోపాల్, పూజారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి


వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పిస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్ : వృద్ధులను ప్రతిఒక్కరూ ఆదరించాలని, అప్పుడే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని స్ఫూర్తి సేవా సంస్థ వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు అన్నారు. పట్టణంలోని తారకరామనగర్‌లో కుటుంబ సభ్యుల నిరాధరణకు గురై ఒంటిరిగా జీవిస్తూ నిస్సాహాయ స్థితిలో ఉన్న వృద్ధురాలు బెస్త వెంకట లక్ష్మీదేవిని బుధవారం ఆయన గుత్తి రోడ్డులోని పద్మావతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. వృద్ధురాలికి ఆశ్రయం ఇచ్చిన నిర్వాహకురాలు పద్మావతికి స్ఫూర్తి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అంజియాదవ్, మోహన్‌రెడ్డి, గోగుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

డోన్‌కు 44వేల పాఠ్య పుస్తకాలు

డోన్ టౌన్ : డోన్ మండలానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు 44,258 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ రామనర్సప్ప తెలిపారు. విజయవాడ నుంచి వచ్చిన పాఠ్య పుస్తకాలను బుధవారం స్థానిక గరల్స్ హైస్కూల్లో భద్రపరచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8,9,10వ తరగతులకు చెందిన 3,919 మంది విద్యార్థులకు 44,258 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. పాఠశాలలు పు:న ప్రారంభం జూన్ 12న విద్యార్థులకు అందజేస్తామన్నారు.


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రామనర్సప్ప